కథ

# స్వానుభవం నేర్పిన పాఠం!

-కందుకూరి వెంకట మహాలక్ష్మి

"కరుణా!" అన్న పిలుపుకి వడక పెళ్ళికొడుకు బుగ్గకి నల్లచుక్క దిద్దుతున్న కరుణ ఆగి తలుపు వైపు చూసింది.

ఏదో ఆందోళన సుధీర్ ముఖంలో స్పష్టంగా కనబడుతోంది. చేతిలో టెలిగ్రాము. ముఖమంతా చమట చూసిన కరుణ కంగారుపడుతూ "ఏమిటండీ! ఏమయింది?" అంటూ భర్త దగ్గరకి వచ్చింది.

'ఇలా రా!' అని ఆమెని పెరటివైపు తీసుకెళ్ళి "శ్వేతకి వంట్లో బాగాలేదుట - కాస్త సీరియస్‌గా వుందిట, ఆసుపత్రిలో చేర్చామని, వెంటనే రమ్మని మన పక్క ఫ్లాటా యన టెలిగ్రామిచ్చాడు" అన్నాడు ముఖానికి పట్టిన చమట తుడుచుకుంటూ. అగాధంలోకి దిగబడి పోతునట్లయి, భయంతో కళ్ళు తిరిగి స్పృహతప్పి పడిపోయింది కరుణ, సుధీర్ చెప్పిన విషయం వినగానే.

ముఖం మీద జల్లిన నీళ్ళకి కళ్ళు తెరిచి చూసింది కరుణ. చుట్టూ బంధువులు, భర్త నిలబడి వున్నారు.

"పాపం దూరాన్నున్నారుకదా? అందులో మా కోడలికి శుభ కార్యాలంటే సరదా ఎక్కువ - అందుకే అంత జబ్బు చేసిన పిల్లని వదిలేసి వచ్చింది." అంటూ అత్తగారు ఎంతో ప్రేమని ఒలకబోస్తూ పక్కనున్న వాళ్ళకి చెప్తుంటే - "బావుంది - ఎంత సరదా అయితే మాత్రం అంత సుస్తీ చేసిన పిల్లని వదిలేసి రావడమేమిటి? తనన్నా వుండిపోవాలి, ఆ పిల్లనన్నా తీసుకురావాలి గానీ! సీరియస్‌గా వుందన్న కబురొచ్చి రాగానే ఇక్కడ వాతావరణం ఎంత మారి పోయిందో చూడండి - పెళ్లి కొడుకుని చెయ్యా లని ముహూర్తం పెట్టామా? ఎవరి ముఖాల్లోనన్నా అనందం కనబడు తోందా? కరుణ పడిపోగానే అంతా కంగారుపడిపోతున్నారాయె!" అంటూ తోటి కోడలి తల్లి అత్తగారి మాటలకి సమాధానం చెప్పడం, ఆ వెంటనే,

"ఇప్పుడు ఎటునుంచి ఎటు వచ్చినా అక్షింతలు మానెత్తినేకదా. వీళ్ళింట్లో వడుక్కి వెళ్ళారు. ఆ పిల్లకిలాగ యిందని నలుగురూ మమ్మల్ని ఆడిపోసుకుంటారు కదా!" అంటూ తోడికోడలు - "అయినా అంత జబ్బు చేసిన పిల్లనొదిలి రావడమేమిటి? వచ్చినా ఒకళ్ళుండి, మరొకళ్ళు వస్తే సరిపోయేది" అంటూ ఆడబిడ్డ. "అత్తారింట్లో కార్యం కదా! వెళ్ళకపోతే ఆడిపోసుకుంటారని వెళ్ళేనమ్మా!" అని రేపు వూరెళ్ళి నలుగురికీ చెప్పి, మనల్ని నాలుగనిపించొద్దూ!" అంటూ మరో ఆడ బిడ్డ.

ఇలా నలుగురూ చుట్టూ కూర్చుని అంటోన్న మాటల్ని వింటున్న కరుణ గుండె భగ్గున మండిపోయింది. నిమ్మకి నీరెత్తినట్లు నిలబడివున్న భర్తని కోపంగా, ఛీత్కారంగా చూసి లేచి వెళ్ళిపోయింది. "ఇంతలా మాట్లాడుతున్న వాళ్ళంతా తను కార్యానికి రాకుండా వుండి వుంటే, ఈ మాటలకి భిన్నంగా ఎన్నని వుండే వారో!" అనుకుంటూ గదిలోకెళ్ళి నాలుగు పక్కలా పడివున్న బట్టల్ని, సామానుల్ని ఓ చోటుకి చేర్చి సర్దుకోసాగింది. పెట్టె సర్దుతున్న కరుణ మనసు మనసులో లేదు. ఓ పక్క బెంగ, కంగారు, మరోపక్క దుఃఖం, బాధ అన్నీ కలిసి కన్నీటి రూపంలో ఆనకట్ట తెగిన నదిలా ప్రవహించసాగాయి. అక్కడ పిల్లెలాగుందో అన్న ఆదుర్దా క్షణక్షణానికి ఎక్కువవుతోంది. రెక్కలు కట్టుకుని అక్కడ వాలాలని మనసు కంగారుపడుతోంది. మనసెంత ఆందోళనకి గురైనా చండీగఢ్ చేరడానికి పూర్తిగా రెండు రోజులు పడుతుంది. మధ్య తరగతి కుటుంబాలు. చిన్న జీతాలు. విమానాలెక్కి వెళ్ళే ప్రసక్తే లేదు. ఏడాదంతా దాచుకున్న డబ్బు ఏడాదికోసారి ఇలాంటి కారణంగా వస్తే ఖర్చయిపోతాయి. అలాంటి వాళ్ళు విమానాలేం ఎక్కుతారు?!

ఓ పక్క పిచ్చి ఆలోచనలు, కంగారు, బెంగతో తను నలిగిపోతుంటే మరోపక్క సొంతవాళ్ళాడేమాటలు మనసుని మరింత గాయపరుస్తున్నాయి. అసలు ఇలా జరగడానికి కారకులెవరు? ఎవర్ని నిందించాలి?

"కరుణా! మా అన్నయ్య మనవడి వడుగుట. మనందర్నీ రమ్మని రాసారు" అంటూ చెప్పిన సుధీర్‌వైపు షాక్ తగిలిన దానిలా చూసింది కరుణ.

"పెళ్ళిళ్ళ సీజన్ కూడాను. మళ్ళీ రిజర్వేషన్లు దొరకవు. ఈ రోజు లంచ్ టైములో వెళ్ళి టిక్కెట్లు రిజర్వేషన్ చేయించుకొస్తా" అన్నదానికి శ్వేత గదిలోంచి వచ్చి "నాన్నగారండీ! నాకు రావడం కుదరదు. నాకు ఫైనల్ ఇయర్ పరీక్షలు నెల్లాళ్ళుకూడా లేవు. పైగా ఈ మధ్యనే నాకు జబ్బు చేసి చాలా క్లాసులు పోయాయి. ఇంక సెలవు పెట్టి తిరగడం కుదరదు" అని నిక్కచ్చిగా చెప్పగానే, కూతురి మీద తాటి చెట్టంతెత్తు ఎగిరిపడ్డాడు. తండ్రీ కూతుళ్ళ మధ్య జరిగిన ఘర్షణలో శ్వేతే నెగ్గడంతో ఏమీ చెయ్యలేని సుధీర్ "అయిన వాళ్ళ మధ్య ప్రేమలు, అభిమానాలు ఇలాగే కొన్నాళ్ళకి తగలడతాయి. మిగిలిన వాళ్ళంతా వాళ్ళ వాళ్ళ కుటుంబాలతో వస్తారు - నలుగురూ అడిగితే నా కూతురికి చదువు, పరీక్షలు అని చెప్పనా? ఏదో నా కూతురొక్కత్తే చదువు వెలగబెడుతున్నట్లు, మరెవ్వరి పిల్లలూ చదువుకోనట్లూను" అంటూ సణగసాగాడు.

పచ్చకామెర్లు వచ్చి ఆరు వారాలపాటు మంచంమీదే వుండి, ఎంతో నీరసంగా వున్న కూతుర్ని వదిలి భర్తతో వడుక్కి వెళ్ళడం కరుణకి కూడా ఏమాత్రం మనసొప్పటంలేదు. ఆ రోగం వచ్చిన రోగికి పత్యం ఎంత ముఖ్యమో భర్తకీ తెలుసు. ఇలాంటి టైములో అతను అలాంటివన్నీ ఆలోచించడు సరికదా, చెప్పినా అర్థం చేసుకోడు. అయినా లేని ధైర్యం తెచ్చుకుని ఆఫీసుకి వెళ్తున్న భర్త దగ్గరకెళ్ళి "ఈసారికి మీరొక్కరూ ఆ శుభకార్యానికి వెళ్ళి రాకూడదూ? పిల్లకి అంత సుస్తీచేసి తగ్గింది. ఈ జబ్బు చాలా ప్రమాదమైనది. పిల్ల పూర్తిగా కోలుకోలేదు. అలాంటిదాన్ని వదిలి వెళ్లడం మంచిది కాదు. బైటి తిండి తినకూడదు" అంటూ చెప్పబోతున్న భార్య మాటల్ని పూర్తి చెయ్యనివ్వకుండానే కరుణ మీద పెద్దగా అరవడం ప్రారంభించాడు.

"అసలు మా వాళ్ళంటేనే నీకు పడి చావదు. వాళ్ళింట్లో ఏది జరిగినా నీకు రావాలని వుండదు. నా వాళ్ళని చూస్తేనే నీకు ఏడుపు. ఒక్కడినీ వెళ్ళాలిట - ఒక్కడినీ! అక్కడికి వెళ్ళగానే మీ ఆవిడేదిరా? అంటే ఏం జవాబివ్వాలిట? పిల్లలన్నాకా రోగాలు రావా? పరీక్షలుండవా? రావడం ఇష్టంలేకపోతే నీకూ, నీ కూతురికీ ఏవో వంకలు, సాకులు కనబడతాయి. అంతా వాళ్ళ వాళ్ళ కుటుంబాలతో వస్తారు - నేనేమో వెర్రి వెధవలా ఒక్కడినీ వెళ్ళి చచ్చువంకలు చెప్తే నా వాళ్ళంతా నన్ను దద్దమ్మనీ, చాతకాని వాడిననీ, పెళ్ళామంటే భయమనీ అనుకోరా? నోరు మూసుకుని రా! ఇక్కడేం కొంపలంటుకుపోవు. వడుగయిన మర్నాడు బయలుదేరి వద్దాం" అంటూ వెళ్ళిపోయాడు.

ఇంక నోరెత్తలేని కరుణ కూతురికి వంద జాగ్రత్తలు చెప్పి, మనసంతా అక్కడే వదిలి భర్త వెంట బయలు దేరింది.

అసలు ఇది ఇలా జరగడం తొలిసారి కాదు. పెళ్ళయి కాపరానికి చండీగఢ్‌కి వచ్చి పద్దెనిమిదేళ్ళు నిండుతున్నాయి. ఈ ఇంట్లో అడుగెట్టినది లగాయతు ఎప్పుడు అత్తవారి ప్రసక్తి వచ్చినా, తను వాళ్ళ గురించి ఏం మాట్లాడినా వ్యతిరేకంగా మాట్లాడినట్లు సుధీర్ పెడర్థాలు తీస్తాడే తప్ప కరక్టా - కాదా? అని ఎన్నడూ ఆలోచించడు. అదీ కాకుండా ఏపని చేసినా "మా వాళ్ళేం అనుకుంటారు?" అనడం రోజూ వింటూనే వుంటుంది. "వేల మైళ్ళదూరంలో వున్న వాళ్ళేమను కుంటారో!" అంటూ ఇక్కడ బ్రతకడం అతనికి అలవాటయినప్పటికీ, ఒకరి కోసం బ్రతికే ఇలాంటి భర్తతో కాపురం చెయ్యడం కరుణకి మాత్రం చాలా విసుగు, చిరాకు కలగసాగింది.

అత్తవారింట్లో వున్న పెద్ద వాళ్ళకే కాకుండా చిన్న వాళ్ళకి కూడా భయపడుతూ, భయపడుతూ అడుగేసేవాడు. అక్కడ నలుగురూ వున్నప్పుడు అలా భయపడుతున్నాడనుకుంటే ఇంత దూరం వచ్చి వంటరిగా వున్నా కూడా భార్యకి చీరకొంటే అమ్మేమనుకుంటుందో! ఏ వూరన్నా భార్యని తీసుకెళ్తే చెల్లెళ్ళేమనుకుంటారో! అంటూ ప్రతీదానికి అంటూవుంటే కరుణకి భర్తపట్ల గౌరవం లేకుండా పోయింది. ఆఖరికి తన పక్క బంధువులు వచ్చినా దూరానున్న తల్లీ తండ్రీ ఏమనుకుంటారో అని భయపడే భర్తతో ఎలా కాపరం చెయ్యాలో అర్థమ

య్యేదికాదు.

ఇవన్నీ ఎలాగో భరిస్తూ వచ్చినా, ఈ రోజు సొంత బిడ్డ - అందులో అంత జబ్బు చేసిన పిల్ల పట్ల కూడా ఎవరేమనుకుంటారో అన్న భయంతో వదిలి వచ్చిన దాని పర్యవసానం గురించి ఆలోచిస్తే భర్త పట్ల ఒక విధమైన నిరసన, అసహ్యం బయలుదేరింది.

"ఎవరేమనుకుంటారో" అంటూ తన్ను తాను హింసించుకోడంతో పాటు ఇంట్లో భార్యాబిడ్డల్ని కూడా హింసిస్తున్నానని ఈయన ఏనాడన్నా తెలుసు కుంటారా? అతనిలా ఆ ఇంట్లో మిగిలిన వాళ్ళెవరైనా ఒకరికోసం బ్రతుకుతూ వారిని వారు బాధించుకుంటున్నారా? ఇలాంటి ఖర్చులు తట్టుకోలేక, చేసిన అప్పులు తీర్చలేక ఆ చిరాకు కోపంతో ఇంట్లో లోకు వగా కనపడే భార్యపైన విరుచుకుపడటం సుధీర్‌కి అలవాటయి పోయింది. అతని స్వభావానికి అలవాటుపడలేక ఆ ఇంటిని ఎలా నడపాలో, భర్తతో ఎలా మాట్లాడాలో, ఎలా మసలుకోవాలో అర్థం కాక కరుణ మాత్రం నలిగిపోసాగింది. వచ్చిన జీతంలో సగం వడ్డీకిపోవడంతో ఇల్లుగడవడం కూడా చాలా ఇబ్బందిగా వుండేది.

కనీసం ఈ రోజన్నా కూతురికలా జరిగినందుకు బాధపడుతున్నాడా అంటే అదీ లేదు. తను అంత ఆందోళనతో సామాను సర్దుతుంటే, నిమ్మకి నీరెత్తినట్లు వీధిలో కూర్చున్నాడు. పైగా "ఎల్లుండే వడుగురా! వుండకుండా వెళ్ళిపోతున్నావు!" అంటూ అంతా అంటుంటే వాళ్ళకి తం దానతాన అంటున్నాడు. దాంతో 'ఛీ! ఇతనూ ఓ మనిషేనా? ఇలాంటి వాళ్ళు పెళ్ళెందుకు చేసుకుంటారు? ఒంటరిగా పడుంటే ఒకర్ని ఇబ్బంది పెట్టకుండా తన ఏడుపేదో తను ఏడ్చేవారు కదా!' అనుకుంది మనసులో కోపం పట్టలేక.

రైలు దిగిన సుధీర్, కరుణలు సామా నింట్లో పడేసి శ్వేతని చేర్పించిన ఆసుపత్రికి వెళ్ళేసరికి సెలైన్ ఎక్కిస్తున్నారు. కూతురి దగ్గర పక్క ఫ్లాట్ వాళ్ళు కూర్చుని సపరి చర్యలు చెయ్యడం చూసిన కరుణకి దుఃఖం ఒక్కసారి పెల్లు బుక్కొచ్చింది.

డోకులు, విరోచనాలతో డీ హైడ్రేట్ అవడంతో నర్సింగ్ హోమ్‌కి తీసుకొచ్చామని, డాక్టర్లు కూడా కంగారుపడటంతో టెలిగ్రాం ఇచ్చామని పక్క వాటా దంపతులు చెప్తున్న మాటలు వింటున్న కరుణ కళ్ళకి వాళ్ళిద్దరూ దేముళ్ళలాగే కనపడ్డారు. సొంత వాళ్ళని, పొరుగు వాళ్ళని పోల్చి చూసుకుంది. ఆఖరికి కన్న తండ్రికన్నా, పక్క వాళ్ళు వెయ్యి రెట్లు నయమనిపిం చింది. ఆసుపత్రిలో చేర్పించడమే కాకుండా రెండు రోజులుగా శ్వేత దగ్గరుండి సపరిచర్యలు కూడా చేస్తున్నారు.

'అంత జబ్బు చేసిన పిల్లని ఎలా వదిలేసి వెళ్ళారండీ!' అంటూ స్నేహితులు అడుగుతుంటే చెయ్యని తప్పుకు తను సిగ్గుపడి కుంచించుకుపోతుంటే, భర్త తనని కానట్లే విని వూరుకునేవాడు. "ఇలాంటి వాళ్ళకీ జన్మకి బుద్ధి రాదు" అనుకుంది.

శ్వేతకి పెళ్ళికుదిరింది. పిల్ల చక్కదనం చూసి కాణీ కట్నం తీసుకోకుండా చేసుకుంటున్నారు. పెళ్ళివారు కోరిందల్లా పెళ్ళి చండీగఢ్‌లోనే చెయ్యాలని, తమ వాళ్ళంతా ఇక్కడే వున్నారని అనడంతో సుధీర్ 'ఊ' అనక తప్పలేదు.

ఈ వివరాలన్నీ తన వాళ్ళందరికీ రాస్తూ రిజర్వేషన్లు చేయించుకుంటారని ముందుగా రాస్తున్నానని రాసాడు.

"అయినవాళ్ళంతా ఆంధ్రదేశంలో వుండగా, వూరు కాని ఊళ్ళో పెళ్ళి చెయ్యటమేమి"టని తల్లి చీవాట్లెడుతూ ఉత్తరం రాస్తే, అన్నదమ్ములు, అక్క చెల్లెళ్ళు పిల్లల పరీక్షలనో, ఇంట్లో ఎవరికో పురుడనో, రోగమనో, బాలింతరాలిని వదిలి రాలేమనో రాయసాగారు.



చివరకి పెళ్ళి ఎల్లుండనగా తల్లీ, అన్నగారూ మాత్రం రావడం చూసిన సుధీర్ మనసు నిజంగానే దెబ్బతిని, చిన్నబోయింది. "దూరాలురా! రావాలంటే మాటలా? వేలకి వేలు రైళ్ళకి పొయ్యాలి, మీరొక్కళ్ళూ అక్కడికొచ్చి ఈ పెళ్ళి చేసుంటే అయినవాళ్ళంతా వచ్చేవారు. నలుగుర్లో చేస్తే వుండే అందం చందం కూడా వేరు. ఇంతమంది నా అన్నవాళ్ళుండి ఏకాకుల్లా ఏమిటీ మారుమూల పెళ్ళి చెయ్యడం?!" అంటూ అత్తగారనే మాటల్ని వింటూ కరుణ అనుకుంది, ఇలా తమ గురించి ఈ అత్తగారు ఏనాడన్నా ఆలోచించిందా? అని. కానీ గట్టిగా అనే ధైర్యం ఏది తనకి?

ఓ పక్క భార్య వైపు బంధువులంతా వచ్చి, తన పక్క వాళ్ళు తప్పదన్నట్లు ఓ ఇద్దరు మాత్రం రావడం బాధగానూ, అవమానంగానూ వున్నా పైకి ఏమీ అనలేక లోపల్లోపలే బాధపడసాగాడు సుధీర్.

పెళ్ళయిన మర్నాడే సెలవు లేదంటూ తల్లితో బయలుదేరుతున్న అన్న, తల్లికి, బట్టలెట్టి దణ్ణం పెడుతున్న సుధీర్‌ని చూసి 'ఒరేయ్ అబ్బాయ్! ఆడ పిల్లలకివ్వవలసిన మంగళ హారతి పళ్ళెం తాలూకు డబ్బు, బట్టలు నాకిచ్చేస్తే తీసుకెళ్ళి వాళ్ళకిచ్చేస్తానురా!' అంది. తల్లిని చిరాగ్గా చూస్తూ' అమ్మా! వాళ్ళ వాళ్ళ బట్టలు, లాంఛనాలు వచ్చినప్పుడే తీసుకెళ్తారులే?"

అన్న సుధీర్‌ని చూస్తూ "అదేమిటిరా! నువ్వు ఇచ్చే లాంఛనాలకోసం వేలకి వేలు ఖర్చు చేసుకుని ఇంతదూరం రమ్మంటావా? అయినా నీకా ఒక్క పిల్ల - మళ్ళీ మళ్ళీ ఇంకేం శుభ కార్యాలు చేస్తావు గనక? చేసినదానికి ఆడపిల్లలకి ఇవ్వవలసింది ఇస్తే మీకే చలవరా!" అనగానే "నిజమేనమ్మా! నువ్వన్నట్లు నాకు ఒక్కత్తే పిల్ల అన్న విషయం వాళ్ళూ తెలుసుకుని ఈ ఒక్కసారికి ఖర్చవుతుంది అని అనుకో కుండా వచ్చి వుంటే వాళ్ళకి నాకూ కూడా నిండుగా వుండేదికదా. వాళ్ళకి లేని ప్రేమ నాకుండాలా. ఇన్నేళ్ళూ మనిళ్ళల్లో అయిన ప్రతీ కార్యానికి మేమూ వేలకి వేలు ఖర్చు చేసుకునే వచ్చాం కదా? వాళ్ళకిలాగే మాకూ అక్కడికి రావాలంటే అంతే దూరం - అంతే ఖర్చు కాదా? పోని రాకపోతే రాకపోయారు వాడికి ఒక్కగానొక్క పిల్ల, ఇంక చెయ్యబోతాడా కార్యాలు - అని ఆలోచించి ఒక్కళ్ళన్నా ఓ పాతిక రూపాయలు పిల్లకివ్వమని నీ చేత పంపేరా అమ్మా! పెద్ద దానివి. నువ్వు పిల్లలందరికీ వారధివి. నువ్వన్నా అందరి గురించి ఒక్కలా ఆలోచించి అందరికీ ఒకేలా నీతి చెప్పడం, అందరి తప్పొప్పుల్ని ఒకేలా సరిదిద్దడం చేస్తే బాగుంటుంది." అంటున్న భర్తని చూస్తూ సుధీరేనా ఇలా మాట్లాడుతున్నది అని ఆశ్చర్య పోయింది కరుణ.

ఏ విషయాన్నయినా మనిషి తనకి తానుగా తెలుసు కోవడమే మంచిది. ఒకనాడు కాకపోతే ఒకనాడన్నా ఇలాంటి వాళ్ళ మనసుకి సూటిగా దెబ్బ తగుల్తుంది. అంతరాత్మ ఆలోచింపజేస్తుంది. అప్పుడే జ్ఞానం వస్తుంది. ఒకరు చెప్పింది వక్రంగా ఆలోచించేవారి కళ్ళు, ఏదో ఒక రోజు ఇలాగే తెరుచుకుంటాయి అనుకుంది కరుణ. ❑